సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



అడ్రస్ ఓ చోట..

బాల్కొండ నియోజకవర్గంలో ఓటరు అడ్రస్ ఒక ప్రాంతంలో ఉంటే పోలింగ్ కేంద్రం మరో చోట ఉండడంతో ఇబ్బందులు పడ్డారు.

- 8లో ▸



కేంద్రాల వద్ద ఉద్రిక్తత

నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు, బీజేపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీ చార్జి చేయడంతో వారికి గాయాలయ్యాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.3 /20.9

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి మంచు కురియవచ్చు.

న్యూస్‌రీల్

ఓటుకు ప్రాధాన్యత

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సుభాష్‌నగర్ : జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఉదయం నుండే పోలింగ్ కేంద్రాలకు తరలివస్తున్న ప్రజలకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. మహిళలు, యువత, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్లు ప్రజలను ఆకర్షిస్తూ, ఓటింగ్ ప్రాధాన్యత గురించి అందరినీ ఆలోచింపజేశాయన్నారు. గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ జరిగిన నియోజకవర్గాలపై దృష్టిపెట్టామన్నారు. ప్రతిపోలింగ్ సెంటర్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని, వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షించామన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉదయం వేళలోనే జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఓటు వేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని వెబ్‌క్యాస్టింగ్ సెంటర్ నుంచి ఓటింగ్ సరళిని అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి పరిశీలించారు. లోటుపాట్లను గమనించి ఆఫీసర్లను అప్రమత్తం చేస్తూ పరిస్థితులను చక్కదిద్దారు. ఆరు నియోజకవర్గాల పరిధిలో 1,549 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది.

అటవీ సిబ్బందిపై దాడి

డిచ్‌పల్లి : అటవీ సిబ్బందిపై గురువారం డిచ్‌పల్లి మండలం నక్కలగుట్ట తండా గ్రామ పంచాయతీ నడిమితండాకు చెందిన గిరిజనులు దాడి చేసినట్లు ఎఫ్ఆర్‌వో రవిమోహన్ భట్ తెలిపారు. వివరాలు.. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కులాస్‌పూర్ బీట్ 133 కంపార్ట్‌మెంట్‌లో 15 హెచ్ఏ ప్లాంటేషన్‌లో కొందరు భూమిని దున్నడానికి యత్నించగా ఫారెస్ట్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో సుమారు 50 నుంచి 60 మంది గ్రామస్తులు కర్రలు, కారంపొడితో వచ్చి ఫారెస్ట్ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో మానస, బీట్ అధికారులు సునీత, ప్రవీణ్, బేస్‌క్యాంప్ వాచర్స్ రవి, సంతోష్, అరవింద్ గాయపడ్డారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్‌వో తెలిపారు.

టెండర్ ఓటు వేసిన దీక్షిత



డిచ్‌పల్లి : డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన ఎస్ దీక్షిత ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లగా అప్పటికే ఆమె ఓటు వేసినట్లు ఎన్నికల అధికారులు చెప్పారు. దీంతో తన ఓటును వేరే వాళ్లు ఎలా వేస్తారని, తొలిసారి తాను ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకుంటానని ఆమె పట్టుబట్టారు. దీంతో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం బ్యాలెట్ పేపర్ ద్వారా ఆమెకు టెండర్ ఓటు వేసే అవకాశం కల్పించారు.

యువకుడిపై కేసు

ఇందల్వాయి మండలం రంజిత్ నాయక్‌తండా పంచాయతీ పరిధిలోని త్రయంబక్‌పేట్ తండాలో 150వ పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తుండగా ఈవీఎంని ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

పోలింగ్ బూత్‌ల సందర్శన

అభ్యర్థులు తమ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ బూత్‌లను సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి జంగంపల్లి తోపాటు కామారెడ్డి పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్లు, పోలింగ్ సిబ్బంది, ఇతర సహాయకులతో ఆయన మాట్లాడారు. – సాక్షి, కామారెడ్డి



కామారెడ్డిలో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి





నగరంలోని దుబ్బ హైస్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు

- కీలకమైన పోలింగ్ ప్రక్రియ పూర్తి
- ఉమ్మడి జిల్లాలో త్రిముఖ పోరు
- కూడికలు.. తీసివేతల్లో అభ్యర్థులు తలమునకలు
- 3న లెక్కింపు ప్రక్రియ కోసం ఉత్కంఠ
- కామారెడ్డి ఫలితంపై జాతీయస్థాయిలో ఆసక్తి
- ఫలితాలపై జోరుగా బెట్టింగ్

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. ఇక చిట్టచివరి అంకమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ మాత్రమే మిగిలింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది.

ఈవీఎంలలో భవితవ్యం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థులు నువ్వా నేనా అనేవిధంగా ప్రచారం చేశారు. నామినేషన్ల ఘట్టం, సోషల్ ఇంజినీరింగ్, పోల్ మేనేజ్‌మెంట్ తదితర వ్యవహారాల్లో బిజీబిజీగా గడిపారు. తాజాగా పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో పోలింగ్ సరళి, ఆయా బూత్‌లవారీగా నమోదైన ఓట్ల వివరాలకు సంబంధించి, పోలింగ్ శాతం తదితర వివరాలతో కూడికలు, తీసివేతలపై అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. గెలుపుపై ఎవరి ధీమాలో వారున్నారు. ఉత్తర తెలంగాణలో కీలకమైన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటాపోటీగా త్రిముఖ పోరు నడిచింది. మూడోసారి అధికారం కోసం బీఆర్ఎస్, అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ, తామే ప్రత్యామ్నాయం అనే రీతిలో బీజేపీ భారీఎత్తున ప్రచారంతో పాటు ఎత్తులు పైఎత్తులు వేస్తూ పోరాడాయి. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా ఉమ్మడి జిల్లాలో మాత్రమే హోరాహోరీ పోరు నడిచింది. దీంతో ఈనెల 3న వచ్చే ఉమ్మడి జిల్లా ఫలితాలపై ఆసక్తి నెలకొంది. ఈనెల 3న ఓట్ల లెక్కంపు ప్రక్రియ కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల ఫలితాల విషయమై బెట్టింగ్ రాయుళ్లు జోరుగా బెట్టింగ్ నిర్వహిస్తుండడం గమనార్హం.

కామారెడ్డిలో పోరుపై..

జాతీయస్థాయిలో ఎక్కువ ఆసక్తిని కలిగిస్తోంది మాత్రం కామారెడ్డి నియోజకవర్గమే. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ బరిలో నిలవగా పోటీగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఢీకొట్టారు. అయితే ఇక్కడ బీజేపీ నుంచి స్థానికంగా అత్యంత బలం, పట్టు కలిగిన అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఏమాత్రం తగ్గేదే లేదన్నట్లు పోరులో నిలిచారు. ప్రజాస్పందన కూడా భారీగా వచ్చింది. దీంతో ఏకంగా పీఎం మోదీ కామారెడ్డికి వచ్చి బహిరంగ సభలో పాల్గొన్నారు. కామారెడ్డి బాద్‌షా ఎవరనేది అంచనాలకు అందని పరిస్థితి నెలకొంది.

అర్బన్‌లో ఉత్కంఠ

✤ ఉమ్మడి జిల్లా కేంద్రమైన అర్బన్ స్థానంలో సిట్టింగ్ బీఆర్ఎస్ అభ్యర్థి గణేశ్‌గుప్తా, బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, కాంగ్రెస్ నుంచి సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ బరిలో ఉన్నారు. అయితే ఈ నియోజకవర్గంలో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. దీంతో ఈ ఫలితంపై ఒక అంచనాకు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో దీనిపై ఉత్కంఠ నెలకొంది.

✤ **ఆర్మూర్** నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పైడి రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి పొద్దుటూరి వినయ్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ అభ్యర్థి జీవన్‌రెడ్డి బరిలో ఉన్నారు. జీవన్‌రెడ్డి ప్రచారంలో అందరికంటే ముందున్నారు. అయితే వినయ్‌రెడ్డి బలమైన అభ్యర్థిగా బరిలో నిలిచినప్పటికీ, రాకేశ్‌రెడ్డి అనూహ్యంగా పోలింగ్ సమయానికి ముందంజలోకి వచ్చారు. దీంతో ఫలితంపైనా ఉత్కంఠ నెలకొంది.

బాల్కొండలో అంచనాలకందని ఫలితం..

✤ బాల్కొండలో బీఆర్ఎస్ సిట్టింగ్ అభ్యర్థి, మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ హోరాహోరీ తలపడ్డారు.

బాన్సువాడలో ఫలితంపై ఆసక్తి..

✤ బాన్సువాడ బరిలో బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ బరిలో నిలిచారు.

జుక్కల్‌లో పోటాపోటీగా..

✤ జుక్కల్ స్థానంలో సిట్టింగ్ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ షిండే, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే అరుణతార, కాంగ్రెస్ తరుపున లక్ష్మీకాంతరావు బరిలో ఉన్నారు. త్రిముఖ పోటీతో ఈ ఫలితంపైనా ఆసక్తి నెలకొంది.

✤ నిజామాబాద్ రూరల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్, కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి, బీజేపీ నుంచి కులాచారి దినేశ్ బరిలో ఉన్నారు. ఈ ఫలితంపై జిల్లావ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

✤ **బోధన్‌లో** బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్, కాంగ్రెస్ తరపున మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నుంచి మోహన్‌రెడ్డి బరిలో ఉన్నారు. కూడికలు, తీసివేతల నేపథ్యంలో ఈ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది.

✤ **ఎల్లారెడ్డిలో** సిట్టింగ్ బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్, కాంగ్రెస్ నుంచి మదన్‌మోహన్, బీజేపీ నుంచి సుభాష్‌రెడ్డి బరిలో ఉన్నారు. కాంగ్రెస్ టిక్కెట్టు దక్కకపోవడంతో సుభాష్‌రెడ్డి చివరి నిమిషంలో బీజేపీలో చేరి టిక్కెట్టు తెచ్చుకున్నారు.



ఓటు వేసిన వృద్ధులు



ఓటేసేందుకు క్యూలో నిల్చున్న మహిళలు



మొదటిసారి ఓటు వేసిన యువత

- ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్
- చిన్న ఘటనలు మినహా..
- ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించిన యంత్రాంగం
- సాయంత్రం 5 గంటల తర్వాత క్యూలో ఉన్న ఓటర్లు

73.72

జిల్లాలో పోలింగ్ శాతం

కామారెడ్డిలో 80.22%

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ శాతం

నియోజకవర్గం	2018లో	2023లో
అర్బన్	62.65	62.56
రూరల్	79.15	76.42
బోధన్	81.34	71.08
ఆర్మూర్	79.08	76.01
బాల్కొండ	79.70	79.30
బాన్సువాడ	84.10	81.26
కామారెడ్డి	78.83	74.86
ఎల్లారెడ్డి	86.32	83.16
జుక్కల్	85.56	81.61

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ జిల్లాలో పోలింగ్ శాతం 73.72గా నమోదైంది. కామారెడ్డి జిల్లాలో 80.22 పోలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ప్రక్రియ మొదట్లో మందకొడిగా ప్రారంభమైనప్పటికీ తర్వాత పుంజుకుంది. పోలింగ్ ముగింపు సమయం 5 గంటలు దాటినప్పటికీ ఓటర్లు క్యూలో ఉన్నారు. అర్బన్ నియోజకవర్గంలో అత్యల్పంగా పోలింగ్ నమోదైంది. 2018 ఎన్నికల్లో 62.65 శాతం పోలింగ్ నమోదు కాగా తాజా ఎన్నికల్లో 62.56 శాతం. అర్బన్ నియోజకవర్గంలోని 16, 17, 19, 41, 42 డివిజన్లలో పోలింగ్ కేంద్రాల వద్ద గుమిగూడడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. గంగాస్థాన్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద పోలీసుల లాఠీచార్జ్‌లో బీజేపీ ఏజెంట్లకు గాయాలయ్యాయి. ఒక కార్యకర్త తలకు గాయమైంది. మహిళలను కూడా కొట్టడమేమిటని బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖిల్లా రోడ్డులోని అహ్మద్‌పుర కాలనీలో నేషనల్ హైస్కూల్ వద్ద దొంగ ఓటరు స్లిప్పులతో సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బోధన్ పట్టణంలో విజయమేరి హైస్కూల్ పోలింగ్ స్టేషన్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య గొడవ చోటుచేసుకోగా పోలీసులు చెదరగొట్టారు. బోధన్‌లోని గోసంబస్తీ ఏరియా వాసులు తమ ప్రాంతంలో అభివృద్ధి లేదని, ఓటేసేది లేదని చెప్పడంతో పోలీసు అధికారులు వెళ్లి సర్ది చెప్పి ఓట్లు వేసేలా చేశారు. ఆర్మూర్‌లోని కోటార్మూర్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో సరిచేసి పోలింగ్ కొనసాగించారు. కామారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి నాన్‌లోకల్ అంటూ బీఆర్ఎస్ నేతలు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. బాన్సువాడలోని వర్ని మండలం సిద్ధాపూర్ పోలింగ్ స్టేషన్ వద్ద డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డితో కాంగ్రెస్ కార్యకర్తలు గొడవ పెట్టుకున్నారు. బోధన్ నియోజకవర్గంలోని రెంజల్ మండలం దూపల్లిలో ఈవీఎం మొరాయించడంతో క్యూలైన్‌లో ఉన్న కొందరు ఓటు వేయకుండానే వెనుదిరిగారు.

దూపల్లిలో మొరాయించిన ఈవీఎం



దూపల్లిలో చీకట్లో లైన్‌లో నిల్చున్న ఓటర్లు

రెంజల్ : మండలంలోని దూపల్లి 156వ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఈవీఎం అరగంట పాటు సతాయించడంతో పాటు అదే సమయంలో వర్షం పడటంతో పలువురు ఓటు వేయకుండానే వెనుదిరిగారు. దీనికి తోడు కరెంట్ లేక ఎన్నికల సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చివరకు ఈవీఎం పనిచేయడంతో ఓటర్లు లైట్ల వెలుతురులో రాత్రి ఏడు గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకున్నారు.



కోటగల్లిలో ఓటు వేసిన 80 ఏళ్ల వృద్ధురాలు



పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో బస్సు దిగుతున్న ఎన్నికల సిబ్బంది



ఓటు వేస్తున్న ఎంపీ అర్వింద్



కలెక్టర్ రాజీవ్ గాంధీ



జడ్జి సునీత కుంచాల

ఓటేసిన అభ్యర్థులు

ఆర్మూర్



కుటుంబ సభ్యులతో ఆశన్నగారి జీవన్‌రెడ్డి



పొద్దుటూరి వినయ్‌రెడ్డి



పైడి రాకేశ్ రెడ్డి

బాల్కొండ



వేముల ప్రశాంత్ రెడ్డి



ముత్యాల సునీల్ రెడ్డి



ఏలేటి అన్నపూర్ణమ్మ

బోధన్



మహ్మద్ షకీల్



పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి



వడ్డీ మోహన్ రెడ్డి

నిజామాబాద్ రూరల్



బాజిరెడ్డి గోవర్ధన్



ఆర్ భూపతిరెడ్డి



కులాచారి దినేష్ కుమార్

నిజామాబాద్ అర్బన్



బిగాల గణేశ్ గుప్తా



మహ్మద్ షబ్బీర్ అలీ



ధన్‌పాల్ సూర్యనారాయణ

క్లుప్తంగా

తన కోసం తన ఓటు..

మోర్తాడ్: బీజేపీ బాల్కొండ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మకు ఈ ఎన్నికల్లో కొత్త అనుభవం ఎదురైంది. గడిచిన ఎన్నికల్లో తనకోసం తన ఓటును ఏనాడూ వినియోగించుకోలేదు. దీనికి కారణం ఆర్మూర్‌లో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆమె బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో ఓటు ఉండడమే ప్రధాన కారణం. గడిచిన 1994, 1999, 2004లో నిర్వహించిన ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తూ వచ్చారు. 2009లో ఓటు హక్కును వినియోగించుకోలేదు. 2014లో టీడీపీ, బీజేపీ బాల్కొండ అభ్యర్థిగా పోటీ చేసిన తన కుమారుడి కోసం తన ఓటు హక్కును వినియోగించారు. ఈ ఎన్నికల్లో బాల్కొండ నుంచి పోటీ చేస్తుండడంతో తొలిసారి తన కోసం తన ఓటును వినియోగించారని చెప్పొచ్చు.

ఓటు వేసిన మాలావత్ పూర్ణ



సిరికొండ: మండలంలోని పాకాల గ్రామంలో ఎవరెస్ట్‌ను అధిరోహించిన మాలావత్ పూర్ణ గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తల్లితండ్రులు లక్ష్మీ, దేవీదాస్‌లతో కలిసి ఓటు వేశారు.

కామారెడ్డి ఓటర్లు చైతన్యవంతులు

- కారు గ్యారేజీకి పోయింది
- రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి



భిక్కనూరు: కామారెడ్డి ఓటర్లు చైతన్యవంతులని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని పోలింగ్ బూతులను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశమంతా కామారెడ్డి అసెంబ్లీ వైపు చూసిందని, కామారెడ్డి ప్రజలు కసితో కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. కామారెడ్డితో పాటు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓటమి తథ్యమని 'కారు' గ్యారేజీకి పోయిందన్నారు. ఇంజిన్ పూర్తిగా చెడిపోయిందని నవ్వుతూ అన్నారు. కామారెడ్డిలో రేవంత్ రెడ్డి 10 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు ఓటమి చూపిస్తున్న కామారెడ్డి ప్రజలకు తాను ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. నేతలు బల్యాల సుదర్శన్, అందే దయాకర్‌రెడ్డి, టీపీ విజయ్ కుమార్ గౌడ్, కల్లూరి సిద్ధరాములు ఉన్నారు.

గెలుపెవరిదో..

- ప్రశాంతంగా పోలింగ్
- 3న ఓట్ల లెక్కింపు
- విజయం తమదే అంటున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు



నగరంలోని రావూజీసంగంలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న మహిళలు

ఖలీల్‌వాడి/ నిజామాబాద్ నాగారాం/ సుభాష్‌నగర్/ డిచ్‌పల్లి/ బోధన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ప్రధాన పార్టీల మధ్య ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్న ఈ ఎన్నికల్లో గెలుపెవరిదో అంటూ జిల్లా అంతటా చర్చ జరుగుతోంది. దీంతో అభ్యర్థులు గెలుపు తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు తమను గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ అభ్యర్థులు, అవినీతి బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఈ ఎన్నికల్లో తమ పార్టీ గెలుపు తథ్యమని బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు గెలుపు ధీమాపై 'సాక్షి'తో తమ మనోభావాలను పంచుకున్నారు.

పథకాలే గెలిపిస్తాయి



నగరంలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. అందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ నుంచి ఇప్పటి వరకు ప్రశాంత వాతావరణం నెలకొంది. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం తథ్యం. బీఆర్‌ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలే నన్ను గెలిపిస్తాయనే నమ్మకం ఉంది.

– బిగాల గణేశ్ గుప్తా, బీఆర్‌ఎస్ అర్బన్ అభ్యర్థి

ధర్మమే గెలుస్తుంది..



ధర్మం, అధర్మానికి మధ్య జరిగిన యుద్ధంలో ధర్మమే గెలుస్తుంది. అన్ని వర్గాల మద్దతుతో విజయం సాధిస్తా. ఓటమి భయంతో బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులను అడ్డుగా పెట్టుకుని కొన్ని డివిజన్లలో వీరంగం సృష్టించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నా వెంటే ఉంటూ అండగా నిలిచారు.

– ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ అర్బన్ అభ్యర్థి

హ్యాట్రిక్ విజయం తథ్యం



రాష్ట్రంలో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో మూడో సారి విజయం తథ్యం. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం. అభివృద్ధి, సంక్షేమ పథకాలే నా గెలుపునకు నాంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలిచారు. రూరల్‌లో 75 శాతం పోలింగ్ నమోదు కావడం హర్షనీయం. బీఆర్‌ఎస్‌దే తుది విజయం.

– బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్‌ఎస్ రూరల్ అభ్యర్థి

మార్పు కోరుకుంటున్న ప్రజలు



రూరల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం. బీఆర్‌ఎస్ అవినీతి పాలనతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేస్తాం. రూరల్‌లో అత్యధిక ఓట్లు కాంగ్రెస్‌కు పడ్డాయి.

– భూపతిరెడ్డి, కాంగ్రెస్ రూరల్ అభ్యర్థి

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



నియోజకవర్గ ప్రజలు బీజేపీని ఆదరించి ఆశీర్వదించారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని గుర్తించారు. ఎంతో ఉత్సాహంతో ప్రజలు బీజేపీకి ఓటు వేశారు. పార్టీ శ్రేణులు నా గెలుపు కోసం ఎంతో కష్టపడ్డారు. అవినీతి పాలనకు ప్రజలు చరమగీతం పాడారు.

– వడ్డీ మోహన్ రెడ్డి, బీజేపీ బోధన్ అభ్యర్థి

డిసెంబర్ 3న బీజేపీ ప్రభుత్వం



రాష్ట్రంలో భారీ మెజార్టీతో డిసెంబర్ 3న బీజేపీ అధికారంలోకి వస్తుంది. రూరల్ నియోజవర్గంలో మహిళలు, యువకులు, గల్ఫ్ కార్మికులు భారీగా బీజేపీకి ఓట్లు వేశారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మూడో స్థానానికి చేరుతుంది. పోలింగ్ రోజు పోలీసులు కొంచెం ఓవరాక్షన్ చేయడం దురదృష్టకరం.

– దినేశ్‌కుమార్, బీజేపీ రూరల్ అభ్యర్థి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది



పదేళ్ల బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారు. అర్బన్‌లో కాంగ్రెస్ విజయం తథ్యం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 75 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందనే నమ్మకం ఉంది. కేసీఆర్ కుటుంబానికి తెలంగాణప్రజలు చరమగీతం పాడే సమయం దగ్గర పడింది.

– షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ అర్బన్ అభ్యర్థి

సూపర్ మెజారిటీతో గెలుస్తా..



నియోజకవర్గ ప్రజలు దీవెనలతో మరోసారి సూపర్ మెజారిటీతో గెలుస్తా. పదేళ్లుగా నియోజకవర్గ ప్రజలకు అందించిన సేవలను గుర్తించారు. సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందించా. అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డా. తన గెలుపునకు శ్రమిస్తున్న నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు.

– షకీల్ ఆమేర్, బీఆర్‌ఎస్ బోధన్ అభ్యర్థి

బోధన్‌లో కాంగ్రెస్‌దే గెలుపు



అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం తథ్యం. బోధన్ నియోజకవర్గ ప్రజలు నిండు మనస్సుతో నన్ను దీవించి కాంగ్రెస్‌కే ఓటు వేశారు. అన్ని వర్గాల ప్రజలు రాష్ట్రంలో కాంగ్రెస్ రావాలని కోరుకుంటున్నారు. సంపూర్ణ మెజారిటీతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తాం.

– సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ బోధన్ అభ్యర్థి

అడ్రస్ ఓ చోట.. ఓటు మరో చోట

మోర్తాడ్‌కు చెందిన ఆకుల ప్రభాష్‌కుమార్‌కు గ్రామంలో ఓటరు కార్డు ఉంది. కానీ ఆయన ఓటు మాత్రం మండలంలోని దొన్కల్ గ్రామ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లో వేయాలని ఓటరు స్లిప్పు జారీ అయింది. దీంతో ఆయన వేరే గ్రామానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇలా ఎంతో మంది సమీపంలోని పోలింగ్ కేంద్రంలో కాకుండా దూరంలో ఉన్న కేంద్రాల్లో ఓటు హక్కు ఉండటంతో ఇబ్బందులు పడ్డారు.

మోర్తాడ్: జాబితాలో తప్పులతో ఓటర్లు అనేక అవస్థలు పడ్డారు. పేర్లు గల్లంతు కావడం, ఒక చోట ఓటు ఉంటే మరో చిరునామాలో వేయాల్సి రావడం లాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. గతంలో ఓటర్ల జాబితాలను ఎన్నో మార్లు సవరణ చేసినా మళ్లీ తప్పులు చోటు చేసుకున్నాయి. ఒక చిరునామాకు బదులు మరో చిరునామాలో స్లిప్పులను పంపిణీ చేయడంతో అనేక మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఇబ్బందులను ఎదుర్కొన్నారు. చిరునామాలో తప్పులు దొర్లడం, ఒక గ్రామానికి బదులు మరో గ్రామంలో ఓటు వేయాల్సి రావడంతో అనేక మంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. ప్రధానంగా కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న అనేక మంది యువతకు ఇలాంటి ఇబ్బందులే తలెత్తాయి. ఒక కుటుంబానికి చెందిన అందరి ఓట్లు ఒకే బూత్‌లో ఉండాలని ఎన్నికల కమిషన్ గతంలో చెప్పింది. కానీ ఇది కూడా చాలా చోట్ల అమలు కాలేదు. బూత్ లెవల్ అధికారులకు సరైన శిక్షణ లేకపోవడం, జాబితాల సవరణకు తక్కువ సమయం ఉండటంతో తప్పులు దొర్లాయని తెలుస్తోంది.



ప్రభావ్‌కుమార్‌కు జారీ చేసిన ఓటరు స్లిప్పు

పోలింగ్ కేంద్రాల వద్ద లాఠీచార్జి

- బీజేపీ కార్యకర్తలు, ఓటర్లకు గాయాలు
- ఖండించిన బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్



పోలీసులతో మాట్లాడుతున్న ధన్‌పాల్

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని 16, 17, 39, 41, 42 డివిజన్లలో బీజేపీ కార్యకర్తలు, ఓటర్లపై పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుమిగూడారని గంగస్థాన్, సుభాష్‌నగర్, దుబ్బలో పోలీసులకు లాఠీలకు పని చెప్పారు. దీంతో అక్కడ ఉన్న బీజేపీ కార్యకర్తలతో పాటు ఓటర్లకు గాయాలయ్యాయి. అంతేగాకుండా ఓటర్ లిస్టులను చించేశారని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. లాఠీచార్జితో గాయపడ్డ వారిని బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ పరామర్శించారు. తలకు గాయమైన కార్యకర్తకు ఆస్పత్రిలో చికిత్స అందించారు. పోలీసులు బీజేపీ నాయకులు, ఓటర్లపై లాఠీచార్జి చేయడాన్ని ధన్‌పాల్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో హిందువుల ఓట్ల శాతం తగ్గించేందుకు పోలీసులు బీఆర్‌ఎస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. హిందువుల ఓట్లు అధికంగా నమోదవుతున్న పోలింగ్ కేంద్రాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఓటేయకుండా భయభ్రాంతులకు గురి చేశారని విమర్శించారు. మహిళలని చూడకుండా కొట్టారన్నారు. ఆరెంజ్ రంగు చొక్కాలు, చీరలు కట్టుకున్న వారిని వెంటనే మార్చేయాలని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీజేపీ గెలుస్తుందనే ఫ్రస్టేషన్‌లో పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మైనారిటీ ఏరియాల్లో స్వేచ్ఛగా వదిలేస్తూ.. హిందువులు అధికంగా ఉన్న కేంద్రాల్లో నిబంధనలు కఠినంగా అమల్జేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారితోపాటు రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన వెంట ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, కొండా ఆశన్న, విజయ్ కృష్ణ, భాస్కర్‌రెడ్డి, రంజిత్ ఉన్నారు.

'ఏనుగు' కారు అద్దాలు ధ్వంసం



ధ్వంసమైన కారు అద్దాలు

బాన్సువాడ: బుడ్మి గ్రామంలో బుధవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి కారు అద్దాలు ధ్వంసమ అయ్యాయి. గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు కొట్టారని ఏనుగు రవీందర్‌రెడ్డికి సమాచారం అందడంతో అర్ధరాత్రి ఒంటి గంటకు గ్రామానికి వెళ్లారు. బీఆర్‌ఎస్ నాయకులే పోలీసులకు సమాచారం ఇచ్చి కాంగ్రెస్ కార్యకర్తలకు కొట్టించారని రవీందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులకు కాంగ్రెస్ అభ్యర్థికి మధ్య జరిగిన వాగ్వాదంలో గుర్తు తెలియని వ్యక్తులు రవీందర్‌రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు.

శెట్పల్లిసంగారెడ్డిలో లాఠీచార్జి

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డిలో గురువారం జరిగిన లాఠీచార్జిలో పలువురికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. పోలింగ్ బూతు వద్ద ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసే ప్రదేశంలో ఓటర్లు గుమిగూడడంతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు లాఠీచార్జ్ చేశారు. గుంపులుగా గుమిగూడడంతో పలుమార్లు జనాలు అక్కడి నుంచి వెళ్లాలని హెచ్చరించినా వినిపించుకోకపోవడంతో లాఠీచార్జి చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలో పలువురు నాయకులకు గాయాలయ్యాయి.

హజ్గుల్‌లో ఘర్షణ

బిచ్కుంద: హజ్గుల్‌లో పోలింగ్ కేంద్రం సమీపంలో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య మాటామాట పెరిగి కార్యకర్తలు ఘర్షణకు దిగారు. పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం చేస్తున్నా రని ఒకరిపై ఒకరు ముగ్గురు పార్టీల కార్యకర్తలు విమర్శలు చేసుకోవడంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు చేరుకొని గుంపులుగా ఉన్న వారిని చెదరగొట్టి అక్కడి నుంచి పంపించారు.

ఓటేసిన అభ్యర్థులు





నగరంలో ఓటు వేసిన యెండల లక్ష్మీనారాయణ, పోచారం గ్రామంలో శ్రీనివాస్‌రెడ్డి..

స్ట్రాంగ్ రూంకు చేరిన ఈవీఎంలు

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల కోసం గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పలు గ్రామాలు, మండలాలకు తరలిన ఈవీఎంలు రాత్రి జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూంకు అధికారులు తరలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి అధికారులు పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.











ఓటేసిన శతాధిక వృద్ధురాలు



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన గోపిశెట్టి వెంకమ్మ (100) తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం న్యాల్‌కల్ రోడ్డులో గల నలంద స్కూల్ పోలింగ్ బూత్‌లో ఆమె ఓటు వేశారు.1952 నుంచి ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటోంది.

ఉమ్మడి జిల్లాలో రెండు గంటలకు ఒకసారి పోలింగ్ వివరాలు

నిజామాబాద్ జిల్లాలో..					
నియోజకవర్గం	9గంటలకు	11 గంటలకు	1 గంటకు	3 గంటలకు	5 గంటలకు
ఆర్మూర్	8.00	16.74	35.60	52.26	68.34
బోధన్	14.29	23.10	36.41	58.75	68.05
బాన్సువాడ	13.36	28.51	53.20	62.15	73.68
నిజామాబాద్‌అర్బన్	6.82	24.32	33.41	46.11	59.10
నిజామాబాద్‌రూరల్	8.74	22.80	43.38	60.83	72.67
బాల్కొండ	7.30	14.65	38.90	62.21	71.00
జిల్లా మొత్తం	9.52	21.25	39.66	56.50	68.30
కామారెడ్డి జిల్లాలో..					
నియోజకవర్గం	9గంటలకు	11 గంటలకు	1 గంటకు	3 గంటలకు	5 గంటలకు
జుక్కల్	7.43	22.43	43.24	57.43	70.21
ఎల్లారెడ్డి	11.02	25.24	45.61	62.70	74.07
కామారెడ్డి	11.09	26.02	34.62	57.16	68.94
జిల్లా మొత్తం	9.94	24.56	41.15	59.09	71.07

బోధన్‌లో సీపీ పర్యటన

బోధన్‌టౌన్: బోధన్‌లోని పోలింగ్ బూత్‌ల ను గురువారం సీపీ కల్మేశ్వర్ పరిశీలించారు. సమస్యాత్మక కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో అనుమానాస్పదంగా కనిపించిన వారిని ప్రశ్నించారు. శక్కర్‌నగర్ కాలనీలో డబ్బులు పంచుతున్న వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తన ఓటు మరొకరు వేశారని వచ్చిన సంధ్యా అనే మహిళతో మాట్లాడారు. ఓటు ఎవరు వేశారో తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా సాగిందని ఆయన తెలిపారు. రెండు చోట్ల డబ్బులు పంచుతున్న వారిని పట్టుకున్నామని వివరించారు. ఒకరి ఓటు మరొకరు వేశారని తమ దృష్టికి వచ్చిందని వెబ్ కెమెరాలను పరిశీలిస్తామని తెలిపారు.

క్రైం కార్నర్

ఓటేసి వెళ్తూ వృద్ధుడి మృతి



భోజన్న (ఫైల్)

నిజామాబాద్ రూరల్: ఓటు హక్కును వినియోగించుకొని ఓ వృద్ధుడు ఇంటికి వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందిన ఘటన రూరల్ మండలంలోని పాల్దా గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పాల్దా గ్రామానికి చెందిన భోజన్న(75) తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. భోజన్న మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

సోనాలలో జింక మృతి



మద్నూర్: మండలంలోని సోనాల గ్రామానికి వెళ్లే రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జింక మృతి చెందినట్లు గ్రామస్తులు గురువారం పేర్కొన్నారు. రహదారిపై జింక పడి ఉన్నట్లు తెలియడంతో అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. ఐదు రోజుల క్రితం మద్నూర్ సమీపంలో ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జింక మృతి చెందింది. వారంలో రెండు జింకలు మృతి చెందాయని అటవీశాఖ అధికారులు రహదారిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవని గ్రామస్తులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..



వర్ని: మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన పెండెం నీలకంఠం (42) నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ గురువారం తెలిపారు. గత నెల 25న నీలకంఠం తన పొలంలో క్రిమిసంహారకమందు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు మందు గొంతులోకి వెళ్లింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్యూలో ఫిట్స్ వచ్చి గాయాలు



నవీపేటలో..



బోధన్‌లో..

కామారెడ్డి టౌన్/ నవీపేట/ బోధన్ టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో ఓటు వేయడానికి వచ్చిన ఓటరుకు ఫిట్స్ వచ్చి కిందపడిపోవడంతో తలకు గాయమైంది. పట్టణంలోని గడిరోడ్‌లో నివాసం ఉంటున్న సత్యం ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న సమయంలో అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చాయి. కింద పడిపోగా తలకు గాయమై రక్తస్రావం అయ్యింది. స్థానిక పోలింగ్ సిబ్బంది 108కు సమచారం ఇవ్వడంతో 20 నిమిషాల అనంతరం అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఓటు వేయకుండా సత్యం, అతని భార్య వెనుదిరిగారు. నవీపేటలోని పోలింగ్ కేంద్రంలోని ఓ ఓటరు సొమ్మసిల్లి పడిపోయారు. బోధన్ పట్టణంలోని పోలింగ్ కేంద్రంలో ఓ ఓటరుకు ఫిట్స్ రావడంతో సిబ్బంది తక్షణమే స్పందించి ఆసుపత్రికి తరలించారు.



ఫిట్స్‌తో కిందపడిపోయిన సత్యం